కొనుగోలు కేంద్రాలకు స్థలాల కొరత

- పొలాలు, ఎత్తువంపులపై కేంద్రాల ఏర్పాటు
- శాశ్వత కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతుల వినతి
- మండలంలో 26 వేల ఎకరాలకు పైగా వరిసాగు


పెగడపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం

పెగడపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలు ఆయకట్టు ప్రాంతంలో ఉన్నాయి. మండలంలో 90 శాతం మంది రైతులు వరిపంటనే సాగు చేస్తారు. దీనికను గుణంగా రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కోసం గ్రామాల్లో ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఈ కేంద్రాలకు ఏ ఒక్క దానికి కూడా శాశ్వత స్థలాలు లేవు. ప్రతిసారీ ప్రభుత్వం ఆధీనంలో ఉన్న పరంపోగు, బంచరాయి భూములు, గుట్టలు, బోర్లు, రైతుల పంట పొలాల మధ్య కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బోర్లు, బండలు, గుట్టలపై ఏర్పాటు చేసే కేంద్రాల్లో చిన్నపాటి వర్షం పడినా ధాన్యపురాశులు కొట్టుకు పోతున్నాయి. పంట పొలాల్లో ఏర్పాటు చేస్తున్న కేంద్రాల్లో వర్షానికి నీల్లు నిలిచి ధాన్యం కుప్పల కింద నీరు చేరుతుంది. ప్రతీ ఏటా 3.50 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని కేంద్రాలకు లారీలు కూడా సక్రమంగా వెళ్లలేక పోతున్నాయి. ప్రతి ఏటా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా.. వాటికి శాశ్వత స్థలాలు లేక ప్రైవేట్ స్థలాల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. శాశ్వతంగా స్థలాలు కేటాంచాలని రైతులు కోరుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. శాశ్వత కేంద్రాలు ఏర్పాటు లేక పోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. మండలంలో ప్రతి సీజన్‌లో 26 వేల ఎకరాలకు పైగానే వరి సాగు చేస్తుండగా సుమారు 3.50 లక్షల క్వింటాళ్ల వరకు ధాన్యం దిగుబడి వస్తోంది. ఈ ధాన్యం కేంద్రాల ద్వారానే కొనుగోలు జరుగుతోంది. రైతుల శ్రేయస్సు దృష్ట్యా ఇప్పటికైనా గ్రామాల్లో ధాన్యం సేకరణకు శాశ్వత స్థలాలు ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించాలని మండల రైతులు కోరుతున్నారు.

శాశ్వత స్థలాలు కేటాయించాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు లేక అవస్థలు పడుతున్నాం. బోర్లు, గుట్టల ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తుండటంతో వర్షం వస్తే ధాన్యం కొట్టుకు పోయే అవకాశం ఉంది. కేంద్రాల ఏర్పాటుకు శాశ్వత స్థలాలు ఏర్పాటు చేసి వాటిలో రైతులకు అన్ని సదుపాయాలు కల్పించాలి.

– బైర పోచయ్య, పెగడపల్లి

ధాన్యం మట్టిలో కలుస్తోంది



శాశ్వత స్థలాలు ఏర్పాటు చేసి కేంద్రాల్లో సిమెంట్ ఫ్లాట్ ఫాం నిర్మించాలి. సీసీ లేక నేలపై ధాన్యం ఆరబోస్తుండటంతో ధాన్యం మట్టిలో కలుస్తోంది. శాశ్వత స్థలాలు ఏర్పాటు చేసి సిమెంట్‌తో ప్లాట్‌ఫాంలు నిర్మిస్తే రైతులకు ఎంతగానో మేలు జరుగుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత స్థలాలు కేటాయించాలి.

– ఇనుగండ్ల శ్రీనివాస్‌రెడ్డి, నామాపూర్

క్లుప్తంగా

వాటర్ ట్యాంకర్ ప్రారంభం


ట్యాంకర్ ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

ధర్మపురి: పట్టణ ప్రజలకు తాగునీరు అందించేందుకు మున్నూరుకాపు సంఘం పట్టణ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేశ్ తన నానమ్మ, అమ్మమ్మ, తాతయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. త్వరలోనే పట్టణ ప్రజల తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని, ఇప్పటికే నిధులు కేటాయించామని పేర్కొన్నారు. పీసీసీ సభ్యుడు ఎస్.దినేశ్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలి


స్కూల్ బస్సులు తనిఖీ చేస్తున్న ఎంవీఐ

కోరుట్ల: వాహనాల యజమానులు వాహన ధ్రువీకరణ కలిగి ఉండాలని కోరుట్ల ఎంవీఐ శ్రీనివాస్ అన్నారు. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో శనివారం స్కూల్ బస్సులు తనిఖీ చేశారు. ఈ సందర్భగా ఎంవీఐ మాట్లాడుతూ ప్రతీ రవాణా వాహనాలకు ఫిట్‌నెస్, పర్మిట్, రిజిస్ట్రేషన్, పొల్యూషన్, టాక్స్, డ్రైవర్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ఇన్సూరెన్సు కూడా ఉండాలని పేర్కొన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

నడవలేని ఓటర్లను గుర్తించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

ఇబ్రహీంపట్నం: మండలంలో నడవలేని స్థితిలో ఉన్న ఓటర్లను గుర్తించాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఎన్నికల సెక్టోరియల్ అధికారులు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడువలేని స్థితిలో ఉన్న 85 ఏళ్లపై బడిన వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న వికలాంగుల ఓటర్లను ఈ నెల 22 వరకు గుర్తించాలని తెలిపారు. వారి ఇంటి వద్దకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకునేలా చేపట్టనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు దీపిక, సుఖన్య, ఆర్ఐ గంగాధర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పరిశోధన పరిజ్ఞానం అవసరం

కోరుట్ల: ప్రతి ఒక్కరికీ పరిశోధన పరిజ్ఞానం అవసరమని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ మూర్తి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బేసిక్స్ ఆఫ్ రీసెర్చ్ మెథడాలజీ, ప్రాజెక్ట్ పుస్తకాన్ని ఇనిస్టిట్యూట్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతీ ఒక్కరికి పరిశోధన పరిజ్ఞానం అవసరమన్నారు. పుస్తక రచయితలు, అధ్యాపకులు డాక్టర్ బూర్ల నరేశ్, డాక్టర్ గుండా శ్రీనివాస్ లను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వాసవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో బల్దియా చైర్‌పర్సన్

జగిత్యాలటౌన్: నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. 40 ఫీట్ల యావర్‌రోడ్డును 60 ఫీట్లకు విస్తరించింది జీవన్‌రెడ్డి అని గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలో పీఎఫ్ ఆఫీస్, ఈఎస్ఐ ఆస్పత్రి, పాస్‌పోర్టు సేవాకేంద్రాన్ని ఏర్పాటు చేయించారని తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ శివారులో పేకాట స్థావరంపై శనివారం రాత్రి పోలీసులు దాడి చేసి 18 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. వారివద్ద రూ.1.51లక్షల నగదు, 18 సెల్ ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రుద్ర శ్రీనివాస్

మల్లాపూర్: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మండల ఇన్‌చార్జి రుద్ర శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గడిచిన పదేళ్లలో భారతదేశం అన్నిరంగాల్లో అద్భుతమైన పురోగతిని సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరాయన్నారు. తెలంగాణలో కేంద్రం అందిస్తున్న నిధులతోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు గడపగడపకి వెళ్లి కేంద్ర సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి అందిస్తున్న నిధులను వివరించి బీజేపీకి ఓటు వేయించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, పట్టణ అధ్యక్షుడు సోమ అశ్విన్, నాయకులు ముత్యాల చంద్రశేఖర్, పుప్పాల మహేశ్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

'బండి'కి మద్దతుగా మహిళా మోర్చా ప్రచారం


కూలీలతో మాట్లాడుతున్న మహిళా నాయకులు

మల్యాల: బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ మద్దతుగా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శనివారం మల్యాలలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలను కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఉపాధిహామీ పథకం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పథకం అని ఉపాధి హామీ కూలీల వేతనాలను పెంచి నేరుగా కూలీల ఖాతాల్లో జమ చేసే విధంగా మోదీగారు చర్యలు తీసుకొని అవకతవకలకు ఆస్కారం లేకుండా చేశారన్నారు. మహిళలకు ఉచితంగా ఉజ్వల సిలిండర్లు ఇచ్చిన ఘనత బీజేపీదే అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్మల, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురతాని భాగ్యలక్ష్మి, సాంబారి కళావతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చింతకింది అనసూయ. మండల అధ్యక్షురాలు కటకం లత. అవుదుర్తి రమ. మండల అధ్యక్షుడు నేరెళ్ల శ్రవణ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటా ప్రచారం

కథలాపూర్: మండలంలోని చింతకుంట, రాజారాం తండా గ్రామాల్లో శనివారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా బీజేపీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. దేశంలో అవినీతిలేని పాలన బీజేపీతోనే సాధ్యమని నాయకులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురిగి వెంకటేశ్, బోదాస్ కమలాకర్, శివ, ప్రకాశ్, రాజేశ్, తిరుపతి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి


కొనుగోలు కేంద్రంలో నాయకులు

కొండగట్టు: మండల కేంద్రంలోని ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. శనివారం సెంటర్‌ను సందర్శించిన నాయకులకు తప్పతాలు,పేరుతో వడ్లు కొనడం లేదని రైతులు ఫిర్యాదు చేశారు. రెండు రోజులు నుంచి కురుస్తున్న చిరుజల్లులతో వడ్లు తడిసిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. తేమ ఎక్కువగా ఉందనే సాకుతో ధాన్యం కొనుగోలు చేయడం లేదని, వెంటనే కొనుగోలు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు

ఎన్డీయేనే మళ్లీ అధికారంలోకి రావాలి

మల్లాపూర్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయేనే మళ్లీ అధికారంలోకి వస్తుందని గల్ఫ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు పెనుకుల అశోక్ అన్నారు. శనివారం అబుదాబిలోని ప్రసిద్ధ హిందూ మందిరంలో లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే గెలవాలని నేపాల్, బంగ్లాదేశ్‌కి చెందిన హిందువులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మోదీ పాలనలో వివిధ దేశాలలో ఉన్న భారతీయులందరికీ సముచిత గౌరవం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గల్ఫ్ కార్మికులు, విదేశీ హిందువులు డాబర్, లాలన, నవీన్, మణి, సందీప్, నరేశ్, కొమురం పాల్గొన్నారు.

గురుకుల పరీక్షలో సాతారం విద్యార్థుల ప్రతిభ


గురుకులానికి ఎంపికైన విద్యార్థులు

మల్లాపూర్: మండలంలోని సాతారం ప్రాథమిక పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షలో ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం ఎనుగందుల శ్రీనివాస్ తెలిపారు. శనివారం గురుకులానికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు పనాస తర్షిత్, ఎర్ర మనోరిత, పందిరి విశ్వక్, సుంకె సూర్యతేజ , మైదం జాహ్నవి, బందెల చత్రిష్, గట్ల విక్రాంత్, బడె నిహాల్, గుర్రం హన్విక, సైదు అభినయ్, కగ్ మోక్షిత్, ఎల్ల షైనిత్ ప్రతిభ కనబర్చి సీట్లు సాధించారన్నారు. వీరిని ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్, యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బొడ్డు రాజేశ్, వీడీసీ చైర్మన్ పోతర్ల ప్రవీణ్, రమేశ్, ఎస్ఎంసీ చైర్మన్ నిగ శ్యామల, ఉపాధ్యాయులు అభినందించారు.

అంజన్న స్వాములకు అన్నదానం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లో శనివారం హనుమాన్ దీక్షాపరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చెరుకు జాన్, రాజిరెడ్డి, సత్తిరెడ్డి, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డి నామినేషన్‌కు తరలిరావాలి

సారంగాపూర్: నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి భారీగా ప్రజలు తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్‌లు తోడేటి శేఖర్‌గౌడ్, న్యారబోయిన గంగాధర్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించి నామినేషన్ కార్యక్రమానికి జన సమీకరణపై సమీక్షించారు. ఈ నెల 22న జరిగే నామినేషన్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో జనం వచ్చేలా చూడాలని కోరారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటేయాలి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న మెప్మా సిబ్బంది

కోరుట్ల: ప్రతీ ఓటరు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని మెప్మా సిబ్బంది కోరారు. మెప్మా ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఇంటింటికీ కర పత్రాలు పంపిణీ చేశారు. సరైన అభ్యర్థికి ఓటు వేయాలని, భయం లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని, డబ్బులు తీసుకోవటం వంటి ప్రలోభాలకు లొంగి ఓటు వేయొద్దని కరపత్రంలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎవరైనా ఉల్లంఘిస్తే వాళ్లపై ఫిర్యాదు చేసేందుకు సి. విజిల్ ఆప్‌ను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఫిర్యాదులు వంద నిమిషాల్లో పరిష్కరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థికసాయం

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన నిరుపేద చల్ల నర్సయ్య కూతురు వివాహానికి మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన ఓగుల అజయ్ అనే యువకుడు రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. అజయ్‌కు నర్సయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


గోధూర్‌లో స్వామివారి కల్యాణం

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు చక్రపాణి మాదవచార్యులు, లక్షణ మూర్తులు ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కల్యాణంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు , బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు సతీమణి సరోజనమ్మ పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై జాగ్రత్త వహించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

జగిత్యాలక్రైం: అగ్నిప్రమాదాలపై జాగ్రత్తలు వహించాలని జిల్లా అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి మధు అన్నారు. శనివారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపులో భాగంగా పాఠశాల విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణ జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రవీందర్, ప్రశాంత్, మల్లేశం, నరేశ్, వేణు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలఅవగాహన కలిగి ఉండాలి

మెట్‌పల్లి: అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఫైర్ ఆఫీసర్ మల్లిఖార్జున్ అన్నారు. ఫైర్ స్టేషన్‌లో శనివారం విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారికి అగ్ని మాపక పరికరాలతో పాటు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉంటే ఆస్తి, ప్రాణ నష్టాలను నియంత్రించడానికి అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీవో శంకర్, ప్రసాద్, గంగాధర్ పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ నగదు రూపంలో చెల్లించాలి


సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మేడిపల్లి: ఉపాధ్యాయుల ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ నగదు రూపంలో చెల్లించాలని పీఆర్‌టీయూ టీఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యాల్ల అమర్నాథ్ రెడ్డి, బోయినపల్లి ఆనందరావు అన్నారు. మండలంలోని వల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో పదవీ విరమణ పొందుతున్న అయిల్నేని నరేందర్ రావు సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యోగస్తుల ప్రయోజనాలను నగదు రూపంలో చెల్లించాలని బాండ్స్ రూపంలో ఇవ్వాలనుకోవడం ప్రభుత్వ అనాలోచిత చర్యని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఏవీఎన్ రాజు. చంద్రప్రకాష్ రెడ్డి, మహేశ్, శ్రీనివాసరెడ్డి, మండల బాధ్యులు వేణుగోపాలరావు, శ్యాంసుందర్, రత్నాకర్, బొమ్మకంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు 'టెట్' మినహాయింపు ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

జగిత్యాల: ఉపాధ్యాయుల పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న టెట్‌కు మినహాయింపు ఇవ్వాలని శనివారం ఢిల్లీలో ఎన్‌సీటీఈ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ యోగేశ్‌ను తపస్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం లెవల్ అనగా కేడర్ మార్పు కాదని, ప్రైమరీ నుంచి హైస్కూల్‌కు మారడమే లెవల్ అన్నారు. 6,7,8 తరగతులను బోధిస్తున్న ఎల్‌పీలకు కూడా లెవల్ మార్పు లేదని, టెట్ అవసరం లేదన్నారు. ఇన్ సర్వీస్‌లో ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయుడు ఎస్‌ఏ ప్రమోషన్ కోసం టెట్ రాయాలి. అలాంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం అర్హత పాస్ పర్సంటేజీని కుదించవచ్చని, ప్రత్యేకంగా టెట్ నిర్వహించవచ్చన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎన్‌సీటీఈ నిబంధనలు సడలించుకునే సౌలభ్యం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందన్నారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, జగిత్యాల జిల్లా నాయకులు ఒడ్నాల రాజశేఖర్, వెంకటరెడ్డి, సురేశ్, అయిల్నేని నరేందర్‌రావు ఉన్నారు.

సమాచారం..

అభివృద్ధి పనులతో గ్రామాల్లో మార్పు

మల్లాపూర్: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, కోట్లాది అభివృద్ధి నిధుల పనులతో గ్రామాల్లో గొప్ప మార్పుకు నాంది పలికిందని ప్యాక్స్ డైరెక్టర్ పూండ్ర లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు మరిపెల్లి మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని వడ్డెర కాలనీ, డబుల్ ఇళ్లల్లోకి తాగునీటి అభివృద్ధి పనులకు శనివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధితో ముందుకు దూసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేంపేట లక్ష్మారెడ్డి, నూతిపెల్లి రాజం, వడ్డెర కాలనీవాసులు శివరాత్రి నర్సయ్య, రాజం పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సమ్మర్ ఉచిత అబాకస్ శిక్షణ

జగిత్యాల: విద్యార్థులకు కాలుక్యులేటర్ కంటే వేగంగా జమ, తీసివేత, గుణకార, భాగాహారాలను నేర్పించడం కోసం ఆన్‌లైన్‌లో సమ్మర్ ఉచిత అబాకస్ శిక్షణ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, క్రియేటివ్ థింకింగ్, నైపుణ్యాల అభివృద్ధికి అబాకస్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఏప్రిల్ 24 నుంచి 7 రోజుల పాటు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు, విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. గ్రూపు లింక్ కోసం 94404 44956 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

22న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మెట్‌పల్లి: సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 28న జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొనే క్రీడాకారుల ఎంపిక కోసం మెట్‌పల్లిలో సోమవారం పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి తెలిపారు. అండర్–14,16,18,20 విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఆసక్తి గల క్రీడాకారులు సాయంత్రం నాలుగు గంటలకు నేరుగా హాజరు కావాలని పేర్కొన్నారు.

టిప్పర్ల పట్టివేత

ఇబ్రహీంపట్నం: అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను శనివారం పట్టుకున్నట్లు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని మూలరాంపూర్ శివారులోని సదర్‌మాట్ బ్యారేజీ నుంచి మడిగే విజయ్ అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తీసి అమ్ముతుండగా, టిప్పర్లను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆరె గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మల్లాపూర్: మండలంలోని రాఘవపేట, గుండంపల్లి గ్రామాల్లో ఇటీవల పలువురు మృతి చెందగా బాధిత కుటుంబాలను శనివారం పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. రాఘవపేటకు చెందిన మాదం గంగాధర్, గుండంపల్లిలో అందెం రాజేశ్ తల్లి మృతి చెందగా, వారి కుటుంబాలకు పరామర్శించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మామిడి లక్ష్మారెడ్డి, నల్ల బాపురెడ్డి, భూపెల్లి దేవయ్య, గురిజల గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

మెట్‌పల్లి: పట్టణంలోని దీన్‌దయాళ్‌నగర్‌కు చెందిన పల్లెపు పద్మ విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. పద్మ ఇంటి వద్ద ఉన్న విద్యుత్ తీగ శనివారం వీచిన గాలికి తెగి పడింది. ఆ సమయంలో అక్కడే ఉన్న కుక్కకు తాకడంతో షాక్ కొట్టింది. ఇది గమనించిన పద్మ కుక్కను కాపాడేందుకు ప్రయత్నించి, విద్యుదాఘాతానికి గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

వివాహిత అదృశ్యం

మల్యాల: పొలం వద్దకు వెళ్లిన వివాహిత అదృశ్యమైన ఘటన మల్యాల మండలం ముద్దుట్లలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై అబ్దుల్ రహీం కథనం ప్రకారం.. ముద్దుట్ల గ్రామానికి చెందిన కట్ట పద్మ(40) ఈ నెల 19న ఉదయం పొలం వద్దకు వెళ్లి, రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసినవారు ఎస్సై 8712686830, సీఐ 8712656818 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సారంగాపూర్: మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 8.30 గంటల నుండి ఉదయం 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.